

# కథా కౌముది

## నాన్న నేను

సత్యప్రకాష్ మిత్తింటి

"అక్క, నువ్వు వీధి చివర రిక్షా ఎక్కి అమ్మమ్మ వాళ్ళ ఇంటికి వెళ్ళండి. జాగ్రత్త!" అని నాన్న అన్నాడు.

అవి నా ఇంటర్మీడియట్ సెలవులు అనుకుంటా. అక్క ఇంజనీరింగ్ 3rd ఇయర్ చేసి సమ్మర్ హాలిడేస్ కు వచ్చింది. నేనేమో ఎంసెట్ ర్యాంక్ కోసం ఎదురుచూపులు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అమ్మమ్మ వాళ్ళింటికి వెళ్దామని ఇద్దరం బయలుదేరాం. చెప్పాలంటే ఇంకా చిన్న పిల్లలు ఏం కాదు కానీ నాన్న అంతే. చెప్పాడు కదా ఊరుకోవచ్చు కదా... ఊహూ...!! గేటు దాకా వచ్చి మేమిద్దరం వీధి చివర రిక్షా ఎక్కేదాకా చూస్తూనే ఉంటాడు. నేనేమో "ఆ మాత్రం మాకు తెలియదా?" అని సణుగుడు. కానీ అది ప్రేమ! ఆ విషయం తెలిసి తెలియని వయసు అది– నాది.

తన కుటుంబం కోసం పెళ్లయిన కొన్నాళ్ళకే మా గ్రామాన్ని వదిలి గుంటూరులో కాపురం పెట్టిన నాన్న, ఈరోజు మేము సంతోషంగా ఉండగలుగుతున్నామంటే అది ఆ రోజు అమ్మ నాన్న తీసుకున్న నిర్ణయమే. పిల్లల చదువు విషయంలో రాజీపడే ఆ కాలానికి, రాజీ పడని ఈ కాలానికి మధ్య ఎదిగిన మా కోసం అప్పట్లోనే మానాన్న ఈ నిర్ణయం తీసుకున్నాడు. నాన్న మా కోసం తీసుకునే జాగ్రత్తలు ఆ వయసులో వారికి తట్టనే తట్టవు. ఒకసారి నా చిన్న వయసులో నాకు రాత్రికి రాత్రి ఆయాసం వస్తే నన్ను భుజాన వేసుకుని హోమియో డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళాడు. అది కూడా మన హీరో సైకిల్ పైన. ఎక్కడ అల్లోపతి కి అలవాటు పడితే నేను తర్వాత బాధ పడతానని, టాబ్లెట్స్ అంటే చిరాకు పడతానని ఆయన నాకు ఎనిమిది సంవత్సరాల వయసులోనే ఈ ఆలోచన చేశారు. ఇది మచ్చుతునక.

ఇంత ఆలోచించి ఇంత ప్రేమించే నాన్న అంటే నాకు భయం కూడా. అక్కని అరుస్తున్నాను అని, పక్కింటి గోడ దూకే నని ఇలా ఒకటి రెండు సార్లు బాగానే దెబ్బలు పడ్డాయి. అంతే అదే చివరిసారి. నేను ఏడవ తరగతి కి వచ్చేసరికి ఫామ్ లో ఉన్న ధోని డకౌట్ అయినట్టు నా చదువు కొంచెం డల్ అయింది. అప్పుడు కూడా నాన్న సున్నితంగా

మందలించాడు తప్పు చేయి చేసుకోలేదు. ఒకటే మాట నా ఆన్సర్ షీట్ చూసి తప్పులు ఎందుకు వచ్చాయో డిస్కస్ చేశారు. "ఇంకా చిన్న పిల్లవాడివి కాదు నువ్వు." అని అన్నారు. ఇది చాలదా నాకు ఆ వయసులో!?!

పిల్లల్ని గారాబంగా పెంచి పెద్దయ్యాక "వీడు అసలు మాట వినట్లేదు అండి" అని అనే తల్లిదండ్రుల్ని చూస్తాం. అసలు తండ్రి అంటేనే "టైగర్, బాబు రావు" అని ఫోన్ లో నెంబర్ సేవ్ చేసు కుంటారు కొందరు. కానీ మా నాన్న అన్ని సమపాళ్ళలో ఇచ్చాడు. నాన్న దగ్గర ఎంత చనువో నాకు అంత భయం, అదే మరోలా చెప్పాలంటే గౌరవం. గౌరవం అంటే "నాన్న గారు" అనే అంత కాదు. నాన్నను ఎప్పుడు డాడీ అనే మా పలకరింపు.

నాన్నకు కోపం ఎక్కువే అని అందరూ అనుకుంటారు కానీ మా నాన్న కోపం ఎప్పుడూ ఉండేది కాదు. ఎదుటివారు తప్పు చేస్తే మందలించే కోపం, ఎదుటివాడు నిర్లక్ష్యంగా కామన్ సెన్స్ లేకపోతే వచ్చే కోపం. అది క్షణికం. నాన్న ఎంత సున్నితం అంటే నేను బాధపడితే ఆయన కన్నీళ్లు పెట్టిన అంతా. కానీ నాన్న కన్నీళ్లు చూడలేను అసలు ఊహించుకోలేను.

నాన్న ప్రతి మాట ప్రతి అడుగు ప్రతి ఆలోచన మా కోసమే. నాన్నకు శత్రువులు లేరు. ఆయనను ఇష్టపడని వారు ఉండరు. కారణం ఆయన మెయింటేన్ చేసే సత్సంబంధాలు. "నేను, నా భార్య చేసే ప్రతి పని నా పిల్లల మీద, వారి భవిష్యత్తు మీద ప్రభావం ఉంటుంది" అని నిబద్ధత ఎప్పుడూ ఆయనలో ఉండేది.

నాన్న– 'ఆయన ఏం చెప్పినా కాదంటారు' అనే భావన అతి కొన్నిసార్లు మాత్రమే నాలో కలిగింది. కారణం ఆయన ఇచ్చిన జ్ఞానం. ఎదుటి మనిషిని అర్థం చేసుకోవడం, మంచి చేయడం నాన్న ఇచ్చిన గుణాలే. ఎంత ముందు జాగ్రత్తగా ఉండేవారంటే ప్రైవేట్ స్కూల్, చదువుకు మాత్రమే అని ఉన్న రోజుల్లోనే నన్ను, అక్కను డ్రాయింగ్, ఎలక్యూషన్, వ్యాస రచన లాంటి వాటికి ఎంతగానో ప్రోత్సహించారు. ఆ ప్రోత్సాహం నాకు జీవితాంతం తోడ్పడుతుంది నా ప్రతి మాటలోనూ, నా నడతలోనూ... ఎవరీ థింగ్ మేటర్స్ ఎలాట్

కనిపించే ప్రతి వస్తువు మా ఇంట్లో మా నాన్న స్వార్జిత మే... ఆయన కష్టార్జితమే. ఆయన ప్రతి కష్టంలోనూ అమ్మ భాగమే. డబ్బు విషయంలో ఎలా పడితే అలా ఉండకుండా ఆర్థిక స్వాతంత్ర్యం అలవాటు చేశాడు మా నాన్న. ప్రతి రోజు కొంచెం పాకెట్ మనీ ఇచ్చేవారు. చిన్న విషయంలో అయినా జాగ్రత్తగా ఉండాలి ఎవరికి ఇబ్బంది కలిగించే విధంగా

మన ఆలోచన ఉండకూడదు అనేవాళ్ళు. ఖర్చుకి కాలిక్యులేట్ చేసుకొనే అవసరం లేదు కానీ అన్ ప్లాన్డ్ గా ఉండకూడదు అనేది ఆయన చెప్పే మాట.

నాకు బాగా గుర్తు నేను పది సంవత్సరాల వయసులో ఉన్నప్పుడు మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే. కానీ అప్పట్లో నే మా నానమ్మ, తాతయ్య తో కాశీయాత్ర ప్లాన్ చేశారు. పది పన్నెండు రోజుల యాత్రలో డబ్బులు బాగానే ఖర్చయ్యాయి. చనువు ఉన్న నేను "డాడీ డబ్బు బాగా ఖర్చు అవుతుంది కదా" అని అన్నాను. అప్పుడు నాన్న అన్నాడు..."అవసరమైన చోట రూపాయికి పది రూపాయలు ఖర్చు పెట్టడంలో తప్పులేదు కానీ అనవసరమైన చోట ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకూడదు" అని. నాకు ఇప్పటికీ అదే గుర్తు. మధ్యతరగతి కావటంవలన పొదుపుగా ఉండటం నేర్పారు కానీ పిసినారితనం గా కాదు. రెండింటికీ తేడా ఉంది.

అవసరానికి తగినంత వాడుకోవడం పొదుపు, అవసరమైన వాడకపోవడం పిసినారితనం.

ఇంగ్లీష్ మీడియం లో ఉన్నప్పటికీ ఇద్దరిని తెలుగులోనూ, హిందీ లోనూ అదే ప్రోగ్రెస్ ఉండాలనేది మా అమ్మానాన్నల ఆలోచన. ఇంగ్లీషులో పాఠాలు ఎంత ఫాస్ట్ గా చదువుతానో తెలుగు పేపర్ అయినా అంతే. **“మాతృభాష రానివాడు మాట్లాడుకునే భాష రాని వాడు ఎందుకురా! ఎంత పరువు తక్కువ!!”** అని మా అమ్మ చెప్పేది. నిజమే. నాకు భాషాభిమానం కొంచెం ఎక్కువే. కానీ నా భాషే గొప్పది అని కాదు. ఎవరిది వారికే గొప్ప. అంతే కదా...

ఎంత కీలకమైన నిర్ణయం అయినా అమ్మానాన్నలు లేకుండా తీసుకోము. అలాంటి నా నిర్ణయంలో మార్పులు చేర్పులు చేసినప్పుడు “నాన్న ఎందుకు ఇలా చేస్తున్నాడు" అని అనిపించినా, “నాన్న చేసింది నూటికి నూరుపాళ్లు కరెక్ట్”! కొన్ని సందర్భాలు, సంఘటనలు మనం బేరీజు వేసుకోలేం. అనుభవాలు నేర్పిన పాఠాలు మా నాన్న మాకు ఇచ్చిన జీవితం.

“ఇలా ఉండు, ఇలా చెయ్యి, ఇలా మాట్లాడు, వాళ్ళతో ఉండకు, వీళ్లలా ఉండు, ఎందుకంత ఖర్చయింది, సినిమాకి ఎందుకెళ్లావ్?” వగైరాలు లేని జీవితం. ఏది ఇలా అని చెప్పకనే మాకు అన్ని చెప్పిన నాన్న అంటే అందుకే నాకు చాలా ఇష్టం. “నాకోసం ఇది చెయ్యి, నాకు అది కావాలి అని ఉంది రా, మీ అమ్మకి ఇది చేయించు” లాంటివి ఏనాడు అడగని నాన్నకి నేను ఏమీ ఇవ్వలేదు ఇప్పటి దాకా. నాన్నే నాకు అన్నీ ఇచ్చాడు. **జీవితం.** వినటానికి మూడు అక్షరాలే

కానీ ఆలోచిస్తే బయటకు రావడం కష్టం. కన్నీళ్లు వస్తున్నప్పటికీ అవి ఆనందం తోనే. అంతగా ప్రేమించిన తల్లిదండ్రులను ఎలా చూసుకుంటానో అనేది నా మదిలో అనునిత్యం ఉండే ఆలోచన.

కోపంగా కనబడే సన్నివేశాల్లో నాన్న ఎందుకు అలా ఉంటాడో నేను ఎప్పుడైతే అలా ఉన్నానో అప్పుడు అర్థమైంది. **"మనం ఏదైతే ఎదుటివారికి ఇస్తామో, అది మనకు ఎదురవుతుంది. మనం ఎలా ట్రీట్ చేస్తామో, అలాగే మనల్ని ట్రీట్ చేస్తారు"** అని నాన్న చెప్పకనే నాకు, అక్కకు చెప్పారు.

ఒక్క సారిగా "*బర్ర్*" మన్న శబ్దం తో ఉలిక్కిపడి లేచాను.

"హ్యాడ్ డిన్నర్? పెరుగు నిమ్మకాయ వేసింది అమ్మ. స్పూన్ కవర్ లో వేశాను" అని నాన్న నుండి మెసేజ్.

"సార్, బస్సు ఒంగోలు వచ్చింది. డిన్నర్ కి ఆపుతున్నాం" అని రాజేష్ ట్రావెల్స్ క్లీనర్ కేక కి ఈ లోకం లోకి వచ్చాను.

ఎప్పుడూ ఇంతే ఇంటి నుండి వెళ్లి పోతున్న ప్రతిసారి మనసు అదోలా బరువెక్కి పోతుంది. కానీ బెంగళూరు చేరిన తర్వాత కూడా ఒకటే ఆలోచన.... నాన్న నన్ను అక్క ను చూసుకున్నంత బాగా నేను నా పిల్లలను చూసుకోగలనా? నో వే. నేను నాన్నంత వాడిని కాదు, నాన్నలాంటి వాళ్ళుండరు.

Click here to share your comments